అన్నదాత సమాయత్తం

వేరుసెనగ సాగుకు సిద్ధం చేసుకుంటున్న రైతులు



సాగుకు సిద్ధమైన పొలం

న్యూస్‌టుడే, తాండూరు

యాసంగిలో వేరుసెనగ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈసారి భారీగా కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు, ప్రధాన జలాశయాలు నిండాయి. బోర్లు, బావుల్లోను నీటి మట్టాలు పెరిగాయి. ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు పొలాలన్నీ మెత్తబడ్డాయి. సెప్టెంబరులో సాగుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. అదను చూసుకొని విత్తనాలు వేస్తున్నారు. కొందరు భూములు అనుకూల పరిస్థితికి రాగానే విత్తనాలు వేయడానికి సిద్ధమవుతున్నారు. అందుబాటులో ఉన్న నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

- గతేడాది సాధారణ సాగు విస్తీర్ణం: 12,654 ఎకరాలు
- సాగైంది: 13,444 ఎకరాలు
- ఎకరాకు వచ్చిన దిగుబడి: 8 క్వింటాళ్లు
- చెరువులు, కుంటలు: 1,179
- ప్రధాన జలాశయాలు: 9
- బోర్లు, బావులు: 60వేలు

విత్తనాల కొనుగోలుకు ఆర్థిక భారం..

వేరుసెనగ పంట సాగుకు నాణ్యమైన విత్తనం అవసరం. ఆరేళ్ల కిందట ప్రభుత్వం రాయితీపై విత్తనాలు విక్రయించింది. తరవాత రావడం లేదు. దీంతో రైతులు ప్రైవేటు విపణిలో క్వింటాకు రూ.15- 16వేల వరకు చెల్లించి కొంటున్నారు. ఇది ఆర్థికంగా భారంగా మారింది. ఎకరా పొలంలో 75- 85 కిలోల వరకు విత్తనాలు అవసరం. పురుగు మందు, ఎరువులు, కూలీల కోసం వ్యయమైనా.. యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు సవ్యంగా చేపడితే ఆశాజనకమైన దిగుబడులు సాధించొచ్చన్న ఆశతో ఉన్నారు.

పెరిగిన మద్దతు ధర..

2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024-25లో వేరుసెనగకు మద్దతు ధర పెరిగింది. 2023-24లో క్వింటాకు రూ.6,377 ఉండగా.. 2024-25లో రూ.406 పెంచి రూ.6,783గా నిర్ణయించింది.

దసరా కంటే ముందే విత్తుతా..

మూడెకరాల్లో వేరుసెనగ పంట సాగు చేయడానికి పొలం సిద్ధం చేసుకున్నా. దసరా కంటే ముందే విత్తనాలు విత్తుతా. గతేడాది నాలుగెకరాల్లో సాగు చేశా. పెట్టుబడి పోను రూ.2 లక్షల వరకు మిగిలింది. ప్రభుత్వం విత్తనాలు రాయితీపై విక్రయిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.– రమావత్ ధన్‌సింగ్, సంగయిగుట్ట తండా, యాలాల మండలం.

అనుకూల వాతావరణం..

వర్షాలు ఆశాజనకంగా కురవడంతో వేరుసెనగ సాగుకు వాతావరణం అనుకూలంగా ఉంది. అక్టోబరు చివరి వరకు విత్తుకోవచ్చు. మంచి యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపడితే ఎకరాకు 8-10 క్వింటాళ్ల దిగుబడులు సాధించొచ్చు. ప్రభుత్వం ఈసారి రాయితీ విత్తనాలు అందించడం లేదు. – రుద్రమూర్తి, వ్యవసాయశాఖ ఏడీ, తాండూరు.




మది నిండా పూల పండగ

మండల పరిధి రాపోల్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు బతుకమ్మ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో తయారు చేసి పాటలు పాడుతూ ఆడారు. అనంతరం భాజాభజంత్రీలు వాయిస్తూ బతుకమ్మలను ఊరేగింపుగా జలాశయానికి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. – న్యూస్‌టుడే, పరిగి గ్రామీణ.

విరుల సిరులు.. ఆత్మీయతల సెలయేరు

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ. తొమ్మిది రోజుల పాటు ఘనంగా జరుపుకొనే ఈ వేడుకలు ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఘనంగా నిర్వహించుకుంటారు. ఈ పండగ వచ్చిందంటే ఆడపిల్లలకు ఎక్కడ లేని సంబరం. ఆడపడుచుల ఆత్మీయతకు వేదికగా నిలుస్తుంది బతుకమ్మ సంబరం. **నేటి నుంచి ఉత్సవాలు** ప్రారంభం కానున్న నేపథ్యంలో నాలుగు జిల్లాల్లోని ప్రత్యేకతలపై కథనం.



వీడని బంధం

హుస్నాబాద్ గ్రామీణం: బతుకమ్మ వేడుకలు ఎక్కడికక్కడ చేసుకోవడం కనిపిస్తుంది. అలాంటిది ఇక్కడ మాత్రం రెండు ఊర్లు కలిసి జరుపుకోవడం విశేషం. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని గాంధీనగర్ తోటపల్లిలో కలిసి ఉండేది. 1995లో గాంధీనగర్ ప్రత్యేక గ్రామ పంచాయతీగా వేరుపడింది. అయినా పాత సంప్రదాయాన్ని వీడలేదు. ఇప్పటికీ కలిసే పండగ నిర్వహించుకుంటున్నారు. 29 ఏళ్లుగా కలిసే బతుకమ్మ ఆడుతుండటం విశేషం. మిత్రులు, బంధువులు కలుసుకుంటారు.



ఆరేళ్లుగా.. రెండువేల మందితో..

కొడంగల్: పుర పరిధిలో బతుకమ్మ సంబురాలు ఏటా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఏర్పడినప్పట్నుంచి ఆరేళ్లుగా మహిళా సంఘాల సభ్యులు నిర్వహిస్తున్నారు. మండలంలోని 242 సంఘాల సభ్యులు దాదాపు 2వేలకుపైగా మహిళలు వేడుకల్లో పాల్గొంటున్నారు. వారం కిందట ముందస్తుగా 200 మందితో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఉషారాణి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 3 మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొని వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.



60 ఏళ్లుగా..: చింతలగాట్ విజయలక్ష్మి, జహీరాబాద్



నాకు 8 ఏళ్ల వయసు ఉన్నప్పటి నుంచి బతుకమ్మ ఆడుతున్నా. ఇప్పుడు నాకు 68 ఏళ్లు. అప్పట్లో స్థానిక మాణిక్‌ప్రభు ఆలయం ముందు ఓ కట్టె మంచం వేసి దానిపై బతుకమ్మలను ఉంచి స్వాములు పూజించేవారు. ఆ తర్వాతే ఆట షురూ అయ్యేది. మంచం చుట్టూ తిరుగుతుంటుంటే పెద్దలు పాటలు పాడేవారు. కాసేపయ్యాక ఊరేగింపుగా రామ్‌మందిరానికి వెళ్లేవారం. పట్టణంలోని వారంతా అక్కడికి వచ్చి ఆడిపాడేవారు.

– న్యూస్‌టుడే, జహీరాబాద్

ఆనవాయితీగా ఇక్కడే..



మెదక్ అర్బన్: మెదక్‌లో బతుకమ్మ సంబరాలనగానే ముందుగా గుర్తుకొచ్చేది కోదండ రామాలయమే. పట్టణంలోని కాలనీలు, కూడళ్లలో బతుకమ్మలను ఉంచి ఆడిపాడుతారు. అనంతరం కోదండ రామాలయానికి తీసుకురావడం ఆనవాయితీ. ఇక్కడికొచ్చాకే నిమజ్జనం చేస్తారు. ఏ వీధిలో చూసినా బతుకమ్మలన్నీ చేరే వేదిక మెదక్ కోదండ రామాలయం.

సిద్దిపేటలో కోలాహలంగా..



సిద్దిపేట: సిద్దిపేటలో బతుకమ్మ వేడుకలు ఏటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. తొమ్మిది రోజులు కూడళ్లు. నయనానందాన్ని పంచుతాయి. రాష్ట్రంలో వరంగల్ తర్వాత అత్యంత కనులపండువగా జరిగేది ఇక్కడే. వివిధ పూలతో బతుకమ్మలు పేర్చడం మొదలు.. మహిళలు ప్రత్యేక అలంకరణతో వైవిధ్యాన్ని చాటుతారు. దారులన్నీ స్థానిక కోమటిచెరువు వైపే. సాంస్కృతిక కార్యక్రమాలు వైభవాన్ని చాటుతాయి.

విశిష్టత తెలిసేలా..



పాపన్నపేట: బతుకమ్మ విశిష్టతను విద్యార్థులకు తెలియజేసే ఉద్దేశంతో రెండో తరగతి తెలుగులో పాఠం రూపంలో పొందుపర్చారు. పూలు సేకరించినప్పటి నుంచి నిమజ్జనం చేసే వరకు వివరించారు. రంగురంగుల పూలు, బతుకమ్మ పేరుద్దాం, బతుకమ్మ ఆడుదాం, బతుకమ్మలెత్తుదాం, పోయిరా గౌరమ్మ అంటూ ఐదు గేయాలను పొందుపరిచారు.

పల్లెకు హరిత తోరణం



మండలంలోని జనగాంలో గ్రామ ముఖ ద్వారం పచ్చని చెట్లతో అలరిస్తోంది. గతంలో హరితహారం కింద నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పచ్చని అందాలతో స్వాగతం పలుకుతున్నాయి. గ్రామంలోకి ప్రవేశించగానే రోడ్డుకు ఇరువైపులా తోరణంలా ఆకట్టుకుంటున్నాయి.

– న్యూస్‌టుడే, పెద్దేముల్.

వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత



విద్యార్థులతో జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ తదితరులు

వికారాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: వన్యప్రాణులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. జాతీయ వణ్యప్రాణి దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవులపైనే మానవ మనుగడ ఆధార పడి ఉందన్నారు. అటవీ జంతువులు అంతరించకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిన్ననాటి నుంచే ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ప్రకృతిలో జరుగుతున్న మార్పులు గమనిస్తారన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన: ఎస్పీ



మాట్లాడుతున్న నారాయణరెడ్డి

మర్పల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఠాణాను మంగళవారం ఎస్పీ నారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దస్త్రాలను పరిశీలించారు. నిఘా నేత్రాల ఆవశ్యకత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. నిఘా నేత్రాలతో నేరాలను అరికట్టవచ్చన్నారు. గ్రామాల్లో గస్తీలు నిర్వహించాలన్నారు. ఠాణాకు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. పెండింగ్ కేసులుంటే సత్వరమే పరిశీలించాలని ఆదేశించారు. వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మోమిన్‌పేట సీఐ నవీన్‌కుమార్, ఎస్సై సురేశ్ ఉన్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో బాలకృష్ణ తదితరులు

యాలాల, న్యూస్‌టుడే: విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఏకలవ్య ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ అన్నారు. మంగళవారం పగిడియాల్ ఉన్నత పాఠశాలలో ఏకలవ్య ఫౌండేషన్ విద్యావాహిని సంస్థ ఆధ్వర్యంలో 6- 10వ తరగతి విద్యార్థులకు హోమ్ మేడ్ సీడ్స్‌పై ప్రాజెక్టు వర్క్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మట్లాడుతూ.. ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, రైతులకు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దసరా నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు

చేవెళ్ల: దసరా నవరాత్రి ఉత్సవాలకు చేవెళ్లలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం ముస్తాబైంది. ఏటా దసరా పండగ సందర్భంగా ఇక్కడ బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు వామనాచారి తెలిపారు.

పండగ వేళ ప్రయాణ పాట్లు

దసరా సెలవులు రావడంతో దూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇతర ప్రయాణికులతో మంగళవారం ఆర్టీసీ బస్టాండ్లు కిక్కిరిశాయి. ఆయా గ్రామాలకు సరిపడా బస్సులు లేకపోవడంతో అవస్థలు పడ్డారు. గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చిందని పలువురు వాపోయారు. బస్టాండ్లలో కూర్చోవడానికి సరిపడా కుర్చీలు ఇతర ఏర్పాట్లు లేవని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

– న్యూస్‌టుడే, పరిగి గ్రామీణ, కొడంగల్.



కొడంగల్ బస్టాండ్‌లో ప్రయాణికులు



పరిగిలో..

అతిథి గృహం.. ఆగిన నిర్మాణం



నిజాం కాలంలో నిర్మించిన అతిథి గృహ భవనం శిథిలావస్థకు చేరడంతో నీటిపారుదల శాఖ అధికారులు దాన్ని కూల్చేశారు. పాత భవనం స్థానంలో కొత్తది నిర్మించేందుకు అయిదేళ్ల కిందట పనులు ప్రారంభించారు. దీనికిగాను రూ.2 కోట్లు మంజూరయ్యాయి. ఏడాదిపాటు పనులు సవ్యంగా సాగాయి. చివరి దశలో ఆగిపోయాయి. దాని చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. – న్యూస్‌టుడే, తాండూరు.

గురువుల సర్దుబాటు.. బోధనకు రాచబాట

న్యూస్‌టుడే, తాండూరుగ్రామీణ

ప్రభుత్వ ఉత్తర్వు అమలుకు అధికారుల కసరత్తు

ప్రభుత్వ పాఠశాలల్లో కొన్నిచోట్ల విద్యార్థులు అధికంగా ఉంటే సరిపడా ఉపాధ్యాయులు లేరు. మరికొన్నిచోట్ల ఉపాధ్యాయులు సరిపడా ఉండగా విద్యార్థులు తక్కువ సంఖ్యలో ఉన్నారు. ఇలాంటి సమస్యలు త్వరలో సమసిపోనున్నాయి. ప్రభుత్వం ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో విద్యా శాఖ అధికారులు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను తాత్కాలికంగా సర్దుబాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో 1100 పాఠశాలలు, లక్షకుపైగా విద్యార్థులు..

జిల్లాలో ప్రాథమిక స్థాయి నుంచి పదో తరగతి వరకు మొత్తం 1100కు పైగా పాఠశాలలు, లక్షకు పైగా విద్యార్థులున్నారు. అయితే ఉపాధ్యాయులు మాత్రం నిర్ణీత ప్రమాణాలకు తగినట్లుగా ఎక్కడా లేరు. తాండూరు మండల, పట్టణంలో 70 విద్యా సంస్థలు కొనసాగుతున్నాయి. వీటిలో 12వేలకుపైగా విద్యార్థులు నమోదయ్యారు. వీరందరికీ సాఫీగా బోధించేందుకు వీలుగా ఉపాధ్యాయుల ఖాళీల స్థానంలో సర్దుబాటు ప్రక్రియ ద్వారా సమస్య పరిష్కరించాల్సి ఉంది. మరోవైపు మండల విద్యాధికారులు పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్య, పని చేస్తున్న ఉపాధ్యాయుల వివరాలతో నివేదికలను సమర్పించాలని హెచ్ఎంలను రెండు రోజుల క్రితం ఆదేశించారు.



అంతారంతండా బడిలో విద్యార్థులు

ఆటంకంగా మారిన బదిలీల ప్రక్రియ..: ఉపాధ్యాయుల సర్దుబాటుకు బదిలీల ప్రక్రియ ఆటంకంగా మారింది. మారుమూల గ్రామాలు, తండాల్లోని బడులకు కొత్త ఉపాధ్యాయులు రాకపోవడంతో పాత ఉపాధ్యాయులు రిలీవ్ అయ్యే పరిస్థితి లేకుండాపోయింది. జిల్లా వ్యాప్తంగా సగానికి పైగా పాఠశాలల్లో ఇలాంటి సమస్యలు ఉన్నాయి. ఏకోపాధ్యాయుడు ఉన్న బడుల్లో సర్దుబాటు ద్వారా మరొకర్ని నియమిస్తే 2 3 తరగతులకు ఒకరు బోధించే ఆస్కారం కలుగుతుందని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. డీఎస్సీ ద్వారా ఖాళీలను భర్తీ చేశాకే సర్దుబాటు చేస్తే మేలని తాండూరు మండల నోడల్ అధికారి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మృత్యుంజయస్వామి తెలిపారు.

ఇవిగో ఉదాహరణలు..: ● ఉద్దండాపూర్‌లో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడు తరగతులు బోధించేందుకు ఇద్దరు ఉపాధ్యాయులే ఉన్నారు. ● అంతారం తండా ప్రాథమిక బడిలో ఐదు తరగతులకు ఒక్క ఉపాధ్యాయుడితో నెట్టుకొస్తున్నారు. ● దస్తగిరిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులకు ఒకరు బదిలీపై, మరొకరు పదోన్నతిపై వెళ్లడంలో ఏకోపాధ్యాయుడు మిగిలారు.

సుందరీకరణ మరిచారు..



పట్టణంలోని కొడంగల్ మార్గంలో రైల్వే వంతెన కింద స్థలాన్ని సుందరీకరణ చేయాలని గత ప్రభుత్వ హయాంలో నిర్ణయించారు. రూ.5 లక్షలు నిధులు సైతం మంజూరయ్యాయి. ఆ నిధులతో అప్పట్లో వంతెన కింద 600 మీటర్ల పొడవునా ఇనుప కంచె ఏర్పాటు చేశారు. మధ్యలో పూలు, పండ్ల మొక్కలు పెంచి అభివృద్ధి చేయాలనుకున్నారు. ఇప్పటికీ ఒక్క అడుగు ముందుకు పడలేదు. అధికారులు స్పందించి పనులు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తాండూరు టౌన్.

ఎస్సీ ఉపకార వేతనాలకు కొత్త మార్గదర్శకాలు

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం

వికారాబాద్, న్యూస్‌టుడే: ఎస్సీ కళాశాలల విద్యార్థుల ఉపకార వేతనాల దరఖాస్తుకు ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను జారీ చేసిందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి అర్హులైన విద్యార్థులు డెమోలో భాగంగా ఎస్ఎస్‌సీ మార్కుల జాబితాలోని పేరు ప్రకారం ఆధార్‌కార్డు ఉండాలన్నారు. బయోమెట్రిక్ విధానంలో ఐరిష్ నమోదు, వేలిముద్ర వేసి దరఖాస్తును మూడు దశల్లో ఈ-పాస్ ప్రక్రియ ద్వారా పంపాలన్నారు. దరఖాస్తులను డిసెంబరు 31లోగా సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు చరవాణి సంఖ్య 8096471304లో, కలెక్టర్ కార్యాలయంలోని 10వ నంబరు గదిలో స్వయంగా వచ్చి సంప్రదించాలని తెలిపారు.

నిబంధనలకు పాతర

బినామీలతో నడుస్తున్న చౌకధర దుకాణాలు

న్యూస్‌టుడే– వికారాబాద్, తాండూర్



పేదల కోసం ఏర్పాటు చేసిన చౌకధర దుకాణాల డీలర్లు నిబంధనలు పాటించడం లేదు. నెల మొత్తం రేషన్ దుకాణాలు తెరిచి ఉంచాలన్న నిబంధన అమలు కావడం లేదు. కొన్నిచోట్ల అనుకూలంగా ఉన్న వేళల్లో తెరిచి వెంటనే మూసేస్తున్నారన్న విమర్శలున్నాయి. మరి కొన్నిచోట్ల నామ ఫలకాలూ ఏర్పాటు చేయలేదని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు.

డీలర్ల ఎంపికలో కొరవడిన పారదర్శకత..

కొత్తగా రేషన్ దుకాణం ఏర్పాటు ప్రకటన రాగానే దరఖాస్తులు కుప్పలుతెప్పలుగా వస్తున్నాయి. అంగబలం, అర్థబలం, రాజకీయ నేపథ్యం ఉన్నవారికే రేషన్ డీలర్లుగా అవకాశమిస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్ పట్టణం, మండలంలో కలిపి 49 దుకాణాలున్నాయి. వాటిలో చాలావరకు బినామీల పేర ఉన్నాయని పలువురు చెబుతున్నారు. వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో ఒకరి పేరున రేషన్ దుకాణముంటే మరొకరు సరకులు పంపిణీ చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ-పాస్ విధానంలో బియ్యం పంపిణీ చేస్తుండటంతో అక్రమాలకు కొంతవరకు కళ్లెం పడినా.. కొన్నిచోట యంత్రాలకు సంకేతాలు అందడం లేదు. మరికొన్ని చోట్ల పనిచేయడం లేదు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- జిల్లాలో చౌకధర దుకాణాలు: 588
- ఆహార భద్రత కార్డులు: 2,14,284
- అంత్యోదయ: 26,865
- అన్నపూర్ణ: 36

చర్యలు తీసుకుంటాం..




నిబంధనలకు లోబడి సరకులు పంపిణీ చేయాలని ఆదేశాలిచ్చాం. వినియోగదారులు ఫిర్యాదు చేస్తే క్షేత్రస్థాయిలో విచారిస్తాం. బినామీలుంటే వెంటనే డీలర్‌షిప్ రద్దుకు సిఫార్సు చేస్తా. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటాం.– రాజేశ్వర్, జిల్లా పౌరసరఫరాల అధికారి.

జాతిపిత.. స్ఫూర్తిప్రదాత

బాపు మాట: మహిళ అర్ధరాత్రి ఒంటరిగా తిరిగినప్పుడే అసలైన స్వాతంత్ర్యం.

మహిళలకు సమాన అవకాశాలు ఉండాలి. అన్నింటా రాణించాలి. దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నది జాతిపిత అభిమతం.

సాధికారత దిశగా..




అన్ని రంగాల్లో దూసుకెళ్తున్న మహిళలు సాధికారత దిశగా పయనిస్తున్నారు. ఉన్నత విద్యపై ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో సమాజం వారికి అండగా నిలవాలి. కుటుంబ రెక్కలు కాపాడుకోవాలి. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఈ దిశగా అడుగులు పడుతున్నాయి. నాలుగు జిల్లాల్లో మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకుంటూ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. మెదక్‌లో 11,833, సంగారెడ్డిలో 16,477, సిద్దిపేటలో 16,773, వికారాబాద్‌లో 12,597 సంఘాలున్నాయి.

నేడు గాంధీ జయంతి

సత్యం, అహింస, సత్యాగ్రహం ఆయుధాలుగా యావత్ భారతావనిని ఒక్కటి చేసి స్వాతంత్ర్యాన్ని తెచ్చి పెట్టారు. ఈ మాట వినగానే మన కళ్ల ముందు ఓ బక్కపల్చని శరీరం, తెల్ల ధోవతి, భుజాన కండువా గుర్తుకొస్తాయి. ఆయనే మనమంతా మహాత్మా అని పిలుచుకునే గాంధీజీ. సమష్టితత్వంతో తెల్లదొరలను తరిమికొట్టడమే కాక సమాజం మెరుగైన బాటలో నడవాలన్న సంకల్పం, పోరాట పటిమ జాతిపితకు మార్గాలు.. గాంధీయిజం అందరికీ ఓ చుక్కాని పాఠం. నేడు మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్ఫూర్తితో మార్పును కాంక్షిస్తూ ప్రత్యేకత చాటుతున్న తీరుపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

- న్యూస్‌టుడే, సిద్దిపేట, జహీరాబాద్ అర్బన్, గజ్వేల్, మెదక్, సంగారెడ్డి అర్బన్, వికారాబాద్



బాపు మాట: నిన్ను నీవు కనుగొనడానికి మార్గం.. ఇతరుల సేవలో నిన్ను నీవు మరచిపోవడమే.

ఆపన్నులకు సాయం చేయడంలోనే నిన్ను నీవు తెలుసుకుంటావంటారు మహాత్ముడు. దీని స్ఫూర్తిగా ఎంతోమంది పేదలకు, ఆపన్నులకు అండగా నిలిచారు.

ఆత్మహత్యలకు చలించి..

మల్లన్నసాగర్ నిర్మాణంలో ముంపునకు గురైన వేటిగడ్డకిష్టాపూర్‌కు చెందిన పులి రాజు ప్రస్తుతం వర్గల్ మండలం తునికి ఖల్సా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. 2000లో రాష్ట్రవ్యాప్తంగా అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను చూసి చలించారు. ఇప్పటివరకు 3 వేల బాధిత కుటుంబాలకు సాయం అందించారు. దాతల సహకారంతో పిల్లల చదివిస్తున్నారు.



వివరాలు సేకరిస్తున్న రాజు


ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో వివిధ వర్గాలకు చెందిన 200 మందితో 'న్యూస్‌టుడే' సర్వే నిర్వహించగా ఇలా స్పందించారు.

ఎలాంటి చర్యలతో గ్రామాల ప్రగతి సాధ్యం?




ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి
ప్రజలు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పని చేయాలి

మహిళలకు ఎలాంటి ప్రోత్సాహం అవసరం?



వివక్షకు వ్యతిరేకంగా స్వేచ్ఛను కల్పించాలి
నచ్చిన రంగంలో ప్రతిభ సాధించేలా వెన్నుతట్టాలి

మహాత్ముడి బోధనలు అనుసరిస్తున్నారా?




అవును
కాదు

బాపు మాట: పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు

గ్రామస్వరాజ్యం బాపూజీ కన్న కల. పల్లెలు అన్నింటా రాణిస్తేనే దేశాభివృద్ధి సాధ్యం. స్వరాజ్యం సాధనకు గ్రామస్థులు సంఘటితంగా ముందుకు సాగాలి.

ప్రణాళికాబద్ధంగా..

గాంధీజీ స్ఫూర్తిగా జహీరాబాద్ మండలం తూంకుంట గ్రామస్థులు స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇచ్చారు. వీధుల్లో ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకుంటున్నారు. దారులకు ఇరువైపులా పూల మొక్కలు నాటి సంరక్షించగా పచ్చదనం అలరిస్తోంది. ఈ-పంచాయతీ నిర్వహణ, ఇంటింటికీ తాగునీరు, తడి, పొడి చెత్త సేకరణ, జనన, మరణ, వివాహ నమోదు సహా ధ్రువపత్రాల జారీ, వీధి దీపాలు, మురుగు కాల్వలు, పచ్చదనం, పరిశుభ్రత, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీ నిర్వహణలో ముందంజలో నిలిచింది. తద్వారా ఈఏడాది జనవరిలో ఐఎస్‌వో ధ్రువపత్రం దక్కింది.



బాపు మాట: కష్టపడితేనే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోగలం.

సాధన లేకుండా విజయాన్ని సొంతం చేసుకోలేం. లక్ష్య సాధనకు కఠోర శ్రమ తప్పనిసరి. ఉన్నతమైన ఆలోచనలను నిర్దేశించుకోవాలన్నది గాంధీ సూచన.

ప్రతిభ చాటేలా..



జనాభాలో గరిష్ఠ భాగం యువతదే. వారంతా చదువే లక్ష్యంగా కాకుండా క్రీడలు, వ్యాయామం, శిక్షణలపై దృష్టి సారించాలి. ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రతిభ చాటుకోవాలి. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో యువత సంఖ్య 15 లక్షలకు పైనే. తాజాగా విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో నాలుగు జిల్లాలకు చెందిన 302 మంది ప్రతిభ చాటడం విశేషం. మెదక్‌కు చెందిన యూత్ ఫర్ బెటర్ సొసైటీ సభ్యులు విపత్కర పరిస్థితుల్లో ఇతరులకు సేవ అందిస్తున్నారు.



గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా హరిత పత్రంపై కిన్నెర అంజయ్య గీసిన చిత్రాలు - న్యూస్‌టుడే, సిద్దిపేట

నాట్యం.. జనరంజకం



కోయ నృత్యం



ఎల్లమ్మ నాటక ప్రదర్శన



సిద్దిపేట విపంచి కళానిలయం వేదికపై విద్యార్థుల ప్రజ్ఞ.. ఆహూతులను అలరించింది. జానపద, శాస్త్రీయ, సంప్రదాయ నృత్యాలతో యువజనోత్సవాలను విద్యార్థులు ఉర్రూతలూగించారు. ఈ సందడి మంగళవారం యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది.

- న్యూస్‌టుడే, సిద్దిపేట

ఉత్తమ సేవలకు గుర్తింపు

హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామ పంచాయతీ కార్మికుడు బోనగిరి లక్ష్మణ్ అందించిన ఉత్తమ సేవలకు తగిన గుర్తింపు లభించింది. ఈ నెల 2న దిల్లీలో జరిగే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ముగింపు సభలో పాల్గొనే అరుదైన అవకాశం దక్కింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సత్కరించనుండటం విశేషం. లక్ష్మణ్ గ్రామ పంచాయతీ మల్టిపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఆర్ఎంపీగా పని చేశారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, పలు కారణాలతో పంచాయతీ కార్మికుడిగా చేరారు. ఏ పనైనా నిబద్ధతతో చేయడమే ఇతడికున్న అలవాటు. గ్రామాన్ని శుభ్రంగా ఉంచేందుకు తోటి కార్మికులతో కలిసి శ్రమిస్తుంటారు. ఈయన సేవలకు పలు సేవా సంస్థలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అవార్డులు అందించడంతో ప్రత్యేకంగా సత్కరించారు. ఈ క్రమంలో గత నెల 17 నుంచి ప్రారంభమైన స్వచ్ఛతా హీ సేవా ముగింపు సమావేశం బుధవారం (2న) దిల్లీలో జరుగనుంది. గ్రామీణాభివృద్ధికి సంబంధించి వివిధ విభాగాల్లో ఉత్తమ సేవ అందించిన వారిని ఎంపిక చేసి దీనికి ఆహ్వానించారు. రాష్ట్రం నుంచి మొత్తం 10 మంది ఎంపికయ్యారు. గ్రామ పంచాయతీ కార్మిక విభాగంలో లక్ష్మణ్ చోటు దక్కించుకోవం విశేషం. కేంద్ర పంచాయతీ, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి ఆహ్వానం మేరకు మంగళవారం దిల్లీకి బయల్దేరారు.



దిల్లీ వెళ్లిన వివిధ జిల్లాలకు చెందిన అధికారులు, కార్మికులు, స్వయం సహాయక సంఘం సభ్యులు



లక్ష్మణ్

- న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం

గుడి కట్టి.. అభిమానం చాటి..

సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ధనసిరి గ్రామస్థులు మహాత్ముడికి ఆలయం నిర్మించి పూజిస్తుండటం విశేషం. ఐదు దశాబ్దాల క్రితం జాతిపిత ప్రతిమ ఏర్పాటు చేశారు. ఆలయాల్లో మాదిరిగా మహాత్ముడి విగ్రహం ఎదుట నంది విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దసరా, దీపావళి, ఉగాది, సంక్రాంతి, మొహర్రం వంటి పండగల వేళ గాంధీజీకి పూజలు చేసి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. 1995లో దివంగత ఎమ్మెల్యే నర్సింహారెడ్డి, అప్పటి సర్పంచి పీకే పాటిల్ విగ్రహ పునఃప్రతిష్ఠాపన చేశారు. మహాత్ముడికి జయంతి, స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను ఇక్కడే చేపడతారు. - న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్



1973లో నెలకొల్పి..



మహాత్ముడు చూపిన బాటలో సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో గాంధీ విగ్రహం నెలకొల్పి పూజిస్తుండటం విశేషం. 1973లో అప్పటి సర్పంచి వెంకట్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే పి.రామచంద్రారెడ్డిలు కలిసి ప్రతిమ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి స్థానికుడు మహాలింగం ప్రతి శుక్రవారం పూజలు చేస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆయన చిన్న కుమారుడు అడివయ్య స్వామి కొనసాగిస్తున్నారు. గాంధీ జయంతి రోజున ప్రత్యేక పూజలతో పాటు క్షీరాభిషేకం చేసి జాతీయ జెండా ఆవిష్కరిస్తారు. అనంతరం గ్రామ సభ నిర్వహిస్తారు. - న్యూస్‌టుడే, కొండాపూర్

అత్యాచార ఘటనపై హరియాణా గవర్నర్ ఆరా

చేర్యాల, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేటలో జరిగిన అత్యాచార ఘటనపై హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆరా తీశారు. ఈ మేరకు గవర్నర్ వ్యక్తిగత కార్యదర్శి కైలాస్ నాగేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట సీపీ అనూరాధతో గవర్నర్ మాట్లాడి.. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత బాలికకు పునరావాసం కల్పించాలని సూచించినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృత్యువాత



అంజిలయ్య

కొడంగల్, బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: బొంరాస్‌పేట మండలంలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామస్థులు, ఎస్సై రవూఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం అంజిలయ్య (34) రోజు మాదిరిగానే ఉదయం వరిపొలం చూసేందుకు వెళ్లాడు. పొలానికి చుట్టిన తీగపై విద్యుత్తు తీగ పడి ఉండటం గమనించకుండా వెళ్లడంతో విద్యుదాఘానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య సంగెం లక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మరో ఘటనలో యువకుడు..



నర్సింలు

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అన్నసాగర్ గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై పాండు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సింలు(28) శివారులోని సామిల్‌లో పనిచేస్తున్నాడు. ఆయన చరవాణిలో మాట్లాడుకుంటూ సామిల్ సమీపంలో ఉన్న విద్యుత్తు నియంత్రిక వైపు వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఆ నియంత్రిక ఎర్తింగ్ తీగకు కాలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి లచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో చిరువ్యాపారి దుర్మరణం

వర్గల్, న్యూస్‌టుడే: వెనుకనుంచి వచ్చిన వాహనం ఢీకొని చిరువ్యాపారి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గిర్మాపూర్ గ్రామ శివారులో మంగళవారం జరిగింది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ములుగు మండలం తునికిబొల్లారం ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన పూసల కృష్ణ (50) ద్విచక్ర వాహనంపై అప్పడాలు, మసాలాలు అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గిర్మాపూర్ గ్రామం నుంచి వెళుతుండగా వెనుకనించి వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. ఎగిరి రోడ్డుపై పడిన కృష్ణ తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. అతడి భార్య పుష్పమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్యాచరణ.. విజ్ఞాన బాట

ప్రణాళికతో సెలవుల్లో వెలుగులు

సమయం వెలకట్టలేనిది. ప్రతి క్షణం ఉన్నతులుగా ఎదిగేందుకు దోహదం చేస్తుంది. విద్యాసంస్థలకు నేటి నుంచి ఈ నెల 14 వరకు ప్రభుత్వం బతుకమ్మ, దసరా సెలవులు ప్రకటించిన విషయం విదితమే. 13 రోజుల పాటు ఇచ్చిన పండగ సెలవులను వినోదంతో పాటు విజ్ఞానమయంగా మార్చుకోవచ్చు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

న్యూస్‌టుడే, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి అర్బన్, వికారాబాద్ కలెక్టరేట్

ఫోన్లకు దూరం సుమా..



విద్యాసంస్థలు కొనసాగినన్ని రోజులు విద్యార్థులు ఉదయం నుంచి రాత్రి వరకు చదువు, హోం వర్క్, సన్నద్ధతతో హడావుడిగా గడిపారు. కాస్త సమయం దొరికితే స్మార్ట్ చరవాణి చూసేవారు. ప్రస్తుత సెలవుల్లో అపరిమితంగా అవకాశం ఇవ్వొద్దు. ఫలితంగా అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కొందరు గంటల కొద్ది చూస్తుంటారు. వారిని కాస్త కట్టడి చేయాలి. ఇతర అంశాలపై దృష్టి మరల్చాలి.

జిల్లాల వారీగా విద్యార్థులు (లక్షల్లో)

1.74	1.09
2.79	1.20


సిద్దిపేట ● | మెదక్ ● | సంగారెడ్డి ● | వికారాబాద్ ●

గౌరవం పెంచుదాం..



సెలవుల్లో కుటుంబ సభ్యులు తమ నేపథ్యాన్ని చెప్పాలి. ఎంత కష్టపడితే ఈ స్థాయికి చేరామనే విషయాన్ని వివరించాలి. పరస్పరం గౌరవించే విధానం అలవర్చాలి. ఊర్లకు పంపిస్తారు కనుక పెద్దలను గౌరవించడం నేర్పించాలి. రోజులో కొంత సమయాన్ని కేటాయించాలి. కలిసి భోజనం చేయడం, సరదాగా, స్నేహపూర్వక వాతావరణంలో మెలుగుతూ.. హిత వచనాలు వల్లెవేయాలి.

ప్రోత్సాహంతో ఉత్సాహం..



పిల్లలకు ఆసక్తి ఉన్న ఆటపాటలతో పాటు నచ్చిన కళల వైపు ప్రేరేపించేందుకు మంచి సమయంగా భావించాలి. చిత్రలేఖనం, శాస్త్రీయ, జానపద నృత్యం, సంగీతం, వాద్యం, ఇతర అంశాలనే నేర్చుకునే అవకాశం కల్పించవచ్చు. ఫలితంగా పట్టు సాధించవచ్చు.

పుస్తకం వైపు మరలేలా..



మారుతున్న పరిస్థితుల్లో పుస్తక పఠనానికి దూరమవుతున్నారు. అత్యధికులు ఆన్‌లైన్ మాధ్యమాలను ఆశ్రయిస్తున్నారు. గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా ఎనలేని విజ్ఞానాన్ని ఆర్జించవచ్చు. ఇక్కడ చదివిన ఎంతో మంది గొప్ప వ్యక్తులుగా ఎదిగారు. ఈ క్రమంలో ప్రతి జిల్లాలో చెంతనే ఉండే విజ్ఞాన భాండాగారాలను వినియోగించుకోవచ్చు. పుస్తకాలు, నిఘంటువులు, పత్రికలు అందుబాటులో ఉన్నాయనే విషయాన్ని గుర్తించాలి.

గ్రంథాలయాలు

21	16
33	20

చెంతనే పర్యాటకం..



కొందరు దర్శనీయ ప్రాంతాలకు సుదూరం వెళ్తుంటారు. కాస్త ఉపాయంగా ఆలోచిస్తే చెంతనే పర్యాటక ప్రదేశాలెన్నో ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలో కోమటిచెరువు, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, నాగులబండ వద్ద అర్బన్ ఫారెస్టు, మెదక్‌లో ప్రఖ్యాత చర్చి, గోల్‌బంగ్లా, సంగారెడ్డి జిల్లాలో మంజీర నది, మ్యూజియం, వికారాబాద్‌లో అనంతగిరి అడవులు ప్రత్యేకం. ఆయాచోట్లకు వెళ్తే వినోదం, విజ్ఞానం పంచేందుకు దోహదం చేసినట్లే.

పర్యాటకులు ఇలా..

10,000	4,500
3,100	2000

సంస్కృతి నేర్పిస్తే..



ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల ప్రభావం ఎంతో ఉండేది. చిన్నా పెద్ద అంతా కలిసి ఉండే వారు. సెలవుల్లో అమ్మమ్మ, నాయనమ్మ ఇళ్లకు వెళ్లడం పరిపాటి. ఇదే అదునుగా సెలవులను సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే వేదికగా మార్చుకోవాలి. పండగ విశిష్టతను తెలియజేయాలి.

జిల్లాల వారీగా కుటుంబాలు (లక్షల్లో)

2.38	2.14
3.29	1.98

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరిస్తున్న ప్రిన్సిపల్ రాములు, పీఈటీ అనిల్‌కుమార్

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం అల్గోల్ మైనార్టీ బాలుర గురుకులం విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రాములు తెలిపారు. జిల్లాస్థాయిలో జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి ఖోఖో అండర్-14, 17 సహా ఫుట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్ బాల్ అండర్-17 విభాగాల్లో విద్యార్థులు రాహుల్, మల్లేశం, అర్మాన్, అఖిల్, మునీర్, షాహిద్ ఎంపిక కావడంతో సంతోషం వ్యక్తం చేశారు. క్రీడల్లో సత్తా చాటేలా శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ప్రశాంత్ గౌడ్, పీఈటీ అనిల్‌కుమార్‌ను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు ప్రదానం చేశారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

సదాశివపేట, న్యూస్‌టుడే: హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ సెషన్ న్యాయమూర్తి భవానీ చంద్ర మంగళవారం తీర్పు వెలువరించారని సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. 'వికారాబాద్ జిల్లా జాంబపూర్ తండాకు చెందిన కాట్రోత్ రవినాయక్ తన మొదటి భార్య చనిపోవడంతో రెండవ భార్యతో కలిసి సదాశివపేట మండలం ఆత్మకూర్‌లో నివాసం ఉంటున్నారు. మొదటి భార్య కూతురు రేణుక వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని కస్తూర్బాలో 8వ తరగతి చదువుతోంది. 2020 సంవత్సరంలో కూతురు ఆరోగ్యం బాగా లేదని చికిత్స నిమిత్తం పాఠశాల నుంచి సదాశివపేటకు తీసుకొచ్చాడు. తిరిగి పాఠశాలకు తీసుకెళ్లేటప్పుడు మార్గమధ్యలో గొంతు నులిపి చంపేసి జ్వరంతో చనిపోయిందని అందరిని నమ్మించాడు. అనుమానం వచ్చి అప్పటి వీఆర్వో పోలీసులు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై కేసు నమోదు చేశారు. అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించడంతో అరెస్టు చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ. 500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని' సీఐ వివరించారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	110-00	డ్రెస్డ్	191-00
రిటైల్	132-00	స్కిన్‌లెస్	218-00

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య



నర్సింలు

కౌడిపల్లి, న్యూస్‌టుడే: భార్య కాపురానికి రావడం లేదని మద్యం మత్తులో భర్త ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం కౌడిపల్లి మండలం సదాశివపల్లి గ్రామ పంచాయతీ పాంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గాదే నర్సింలు(35), మౌనిక దంపతులు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. భార్య ఎనిమిది నెలల క్రితం కుటుంబ కలహాలతో పుట్టింటికి వెళ్లిపోయింది. తీవ్ర మనస్తాపం చెందిన నర్సింలు మద్యం మత్తులో ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబీకులు వచ్చి చూసేసరికి మృతిచెందాడు. మృతుడి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు. నర్సింలుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మోసం చేసిన స్థిరాస్తి సంస్థ

సాయిసూర్య డెవలపర్స్ ఎండీపై కేసు

ఈనాడు, హైదరాబాద్: ప్రముఖ సినీ నటుడితో ప్రచారం చేయించి, భారీ వెంచర్లు ప్రారంభిస్తున్నామని ఆర్భాటం చేసిన హైదరాబాద్‌లోని సాయిసూర్య డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.3.63 కోట్లు వసూలు చేసి వినియోగదారుడిని మోసగించింది. నగర శివారులోని మన్సాన్‌పల్లిలో నేచర్ కౌంటీ పేరుతో మొదలు పెట్టిన ప్రాజెక్టులో ప్లాట్లు రిజిస్టర్ చేయిస్తామంటూ నమ్మించి వంచించింది. మంగళవారం బాధితుడి ఫిర్యాదుతో సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. జూబ్లీహిల్స్‌కు చెందిన అచ్యుతసింగ్ నైజీరియాలో వ్యాపారం చేస్తున్నాడు. సాయిసూర్య డెవలపర్స్ సంస్థ ప్రాజెక్టుల గురించి సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకుని ఆకర్షితుడయ్యాడు. 2021 నవంబరులో సంస్థ ఏజెంట్ కరీమ్‌ను సంప్రదించగా, హైదరాబాద్ శివారు, వికారాబాద్‌లో ప్రాజెక్టులు ప్రారంభిస్తోందని వివరించాడు. అచ్యుతసింగ్ గచ్చిబౌలిలోని సంస్థ కార్యాలయానికి వెళ్లి ఎండీ సతీశ్ చంద్ర గుప్తాను కలిశారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మాన్సాన్‌పల్లిలో నేచర్ కౌంటీ ప్రాజెక్టు ప్రారంభిస్తున్నట్లు ఎండీ వివరించాడు. తక్కువ ధరకే విక్రయిస్తున్నట్లు చెప్పాడు. అచ్యుతసింగ్ సర్వే నం.32లో 1230, 900 చదరపు గజాల చొప్పున రెండు స్థలాలను రూ.3.63 కోట్లకు కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నాడు. 2022 జనవరి తొలివారంలో రిజిస్ట్రేషన్‌కు అంగీకారం కుదుర్చుకున్నారు. గడువులోగా రిజిస్టర్ చేయిస్తామని చెప్పడంతో అచ్యుతసింగ్ మొత్తం నగదు చెల్లించాడు. 2022 జనవరి 7న రిజిస్ట్రేషన్ చేయిస్తానని సతీశ్‌చంద్ర చెప్పడంతో. అచ్యుతసింగ్, ఆయన కూతురు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. సతీశ్ రాకపోవడంతో అచ్యుతసింగ్ గచ్చిబౌలిలోని కార్యాలయానికి వెళ్లగా, సతీశ్ చంద్ర నెల్లూరు వెళ్లినట్లు సిబ్బంది చెప్పారు. సతీశ్ చంద్ర కాలయాపన చేయడంతో, బాధితుడు సంస్థ గురించి ఆరా తీయగా మరింత మందిని మోసం చేశారని గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. సతీశ్‌చంద్ర, కరీమ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని వివరించారు.

బసవతారకం ఆస్పత్రిలో మహిళా రోగులకు ఉచిత కన్సల్టేషన్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అక్టోబరు 1 నుంచి 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. అక్టోబర్ నెలను రొమ్ము కాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 'స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు ఫోన్‌నం.040- 23551235, 23550967లను సంప్రదించవచ్చని సూచించారు.



పరిగిలో ఆటాడుతున్న విద్యార్థినులు

బడుల్లో బతుకమ్మ.. బాలలు మురిసేనమ్మా



దుద్యాల పాఠశాల ప్రాంగణంలో..

ముందస్తుగా బతుకమ్మ ఉత్సవాల్ని జిల్లా వ్యాప్తంగా సర్కారు, ప్రైవేటు, గురుకుల పాఠశాలల్లో నిర్వహించారు. ఆవరణలో ఆడుతూ, పాడుతూ విద్యార్థినులు, టీచర్లు సందడి చేశారు. భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించడంలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. అనంతరం సమీపంలోని వాగుల్లో నిమజ్జనం చేశారు. - న్యూస్‌టుడే, బృందం



జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయినులు

పంట రక్షణకు పాట్లు

అడవి జంతువుల దాడులతో రైతుల్లో గుబులు

న్యూస్‌టుడే, పూడూరు:

మొక్కజొన్నకు బుట్టలు వచ్చి విత్తులు గట్టిపడుతున్నాయి. పత్తి కాయలు వస్తున్నాయి.. క్యారెట్ తదితర కూరగాయ పంటలు చేతికి వచ్చే సమయం ఇలాంటి పరిస్థితిలో అడవి పందులు పొలాల్లోకి చేరి పంటను ధ్వంసం చేస్తున్నాయి. మొక్కలను తొక్కుతూ పత్తి కాయలను కొరికేస్తున్నాయి. మొక్కజొన్న బుట్టలను నష్టపరుస్తున్నాయి. వాటిని చంపితే కేసులు అవుతాయని రైతులు భయపడుతున్నారు. జిల్లాలో ప్రధాన పంటలైన పత్తి, కంది, మొక్కజొన్న, సోయా తదితర పంటలు దాదాపు 5 లక్షల ఎకరాల వరకు సాగవుతున్నాయి.

కునుకు లేకుండా..

కొద్ది రోజుల్లోనే పంట కోతలకు వచ్చే



పాడైన మొక్కజొన్న పంట



కండ్లపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన పరికరం

సమయం కావటంతో ఎలాగైనా కాపాడుకోవాలని అన్నదాతలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కొందరు ప్రత్యేకంగా దుకాణాల నుంచి తక్కువ ధర చీరలను తెచ్చుకుని పంట పొలాల చుట్టూ కట్టి ఉంచుతున్నారు. మరి కొందరు సన్నటి తాడుకు పంది కొవ్వును పూసి పొలం చుట్టూ కడుతున్నారు. వాసనకు పందులు దరి చేరవని చెబుతున్నారు. పగలు, రాత్రిల్లోనూ కాపలగా ఉంటూ టపాసులు కాల్చుతూ శబ్దాలు చేస్తున్నారు. కరెంటు ఛార్జింగ్‌తో శబ్దాలు చేస్తూ.. రాత్రంతా పనిచేసే స్పీకర్ మైకులను పొలాల్లో అమర్చి పొలంవద్ద ఉంచుతున్నారు. ఇంత చేస్తున్నా నివారణ సాధ్యం కావటం లేదు. యథేచ్ఛగా పొలాల్లోకి దూరుతూ పంటలపై దాడులు చేస్తునే ఉన్నాయి. రాత్రిల్లో తిరుగుతుండటంతో కొందరు పాము కాట్లకు గురైన వారు ఉన్నారు.

సౌర విద్యుత్తు మేలు: తులసీరాం, ఏవో పూడూరు

పంటలు చేతికి వచ్చే సమయంలో అడవి జంతువులతో అనేక పంటలు దెబ్బతింటున్నట్లు తమ దృష్టికి వచ్చింది. వాటి నుంచి పంటలను రక్షించుకునేందుకు విద్యుత్ షాక్ పెట్టకూడదు. ప్రస్తుతం సౌర పలకలు, శబ్దాలు చేసే మైకులు అందుబాటులోకి వచ్చాయి. రైతులు సాధ్యమైనంత వరకు కాపలగా ఉండటంతో పాటు బెదిరించే బొమ్మలు వంటివి పొలాల్లో ఏర్పాటు చేసుకుంటే నివారించవచ్చు.

ప్రాణాలకు ఆపద..

- పూడూరు మండలం రాకంచర్లకు చెందిన గోపాల్ మూడేళ్ల క్రితం దోమ మండలం దిర్సంపల్లిలో ఉంటున్న బంధువుల వద్దకు వెళ్లాడు. చీకటి పడిన తరువాత బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఎంతకు రాలేదు. మరుసటి రోజున రంగంపల్లి పరిసరాల్లో పొలాల సమీపంలో శవమై కనిపించాడు. గోపాల్ కాళ్లకు కాలిన గాయాలు కావటంతో అడవి పందుల కోసం సమీపంలోని పొలానికి చెందిన రైతు వేసిన కంచెకు తాకి మృతిచెందినట్లు గుర్తించారు.
- దోమ మండలానికి చెందిన ఓ వ్యక్తి కుందేళ్ల వేటకు వెళ్లి అక్కడ సంచరిస్తుండగా మొక్కజొన్న పొలానికి అమర్చిన విద్యుత్తు తీగను తాకి అక్కడికక్కడే మృతిచెందాడు.
- పూడూరు మండలం గొంగుపల్లి వికారాబాద్ మండలం కొత్రెపల్లి శివారులో మొక్కజొన్న పొలం చుట్టూ ఇనుప కంచెను అమర్చి విద్యుత్తు పెట్టడంతో సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో ఉండే రెండు ఖరీదైన గుర్రాలు మేతకు వెళ్లి మృత్యువాత పడ్డాయి. అప్పట్లో పోలీసులు బాధిత రైతుపై కేసు పెట్టారు. ఏటా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవటంతో ప్రాణాలు పోవటంతో పాటు ఆర్థికంగా నష్టపోతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి : 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, కుల్కచర్ల గ్రామీణ, పూడూరు, తాండూరు టౌన్:

? బండవెల్కిచర్ల ఎస్సీ కాలనీలో తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ట్యాంకు ఇళ్లకు సమీపంలో ఉండటంతో కూలితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ట్యాంకును తొలగించి కొత్తది నిర్మించేలా చూడాలి. - రమేష్, స్థానికుడు

✔ ట్యాంకును తొలగించాల్సిన అవసరం ఉందనేది మా దృష్టికి వచ్చింది. సమస్యను మండల అధికారులకు విన్నవించాం. త్వరగా పరిష్కరించేలా చూస్తాం. - ఖాజాపాష, పంచాయతీ కార్యదర్శి.

? వంట గ్యాస్‌పై రాయితీ కోసం దరఖాస్తు చేసుకున్నా.. గ్రామంలో చాలా మందికి వర్తించడం లేదు. అధికారులను అడిగినా సరియైన సమాధానం చెప్పటం లేదు. - సుశీల, పెద్దఉమ్మెంతాల్

✔ ప్రజాపాలన దరఖాస్తుల్లో సరియైన వివరాలు నమోదు చేయక పోవడంతో రావటం లేదు. పరిశీలించి ఇలాంటి వారికి వర్తింపజేస్తాం. - పాండు, ఎంపీడీవో.

? మోమిన్‌గల్లీని వీధుల్లో చెత్తకుప్పలు తొలగించటం లేదు. ఇబ్బందులు పడుతున్నాం. - శ్రీను, తాండూరు.

✔ వీధుల్లో చెత్తకుప్పలు పూర్తి స్థాయిలో తొలగించటానికి చర్యలు తీసుకుంటాం. - విక్రమ సింహారెడ్డి, పురపాలక సంఘం కమిషనరు

ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలి

మొయినాబాద్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు అవకాశం కల్పించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ(టీపీయూఎస్) సంఘం రంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షుడు గణపురం సురధీర్ డిమాండ్ చేశారు. పీఆర్సీ నివేదికను రూపొందించి అమలును త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. మంగళవారం మొయినాబాద్ మండలంలో పలు గ్రామాల్లోని పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.

గొడవకు కారణమైన వారికి రిమాండ్

పూడూరు, న్యూస్‌టుడే: పూడూరు మండల కేంద్రంలో గత నెల 15న రాత్రి వినాయక నిమజ్జనంలో జరిగిన గొడవకు కారణమైన వారిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఊరేగింపులో డీజేలను అడ్డుకునేందుకు వెళ్లగా పోలీసులపై కొందరు నిరసనకు దిగి గొడవ పడ్డారన్నారు. కారకులైన సుజాత, మలెగట్ల మల్లేశం, శ్రీశైలం, పాండు, శేఖర్, అనిల్, నర్సింలు, శ్రీనివాస్, జంగయ్యలను సోమవారం అదుపులోకి తీసుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ సంతోష్‌కుమార్, పుర కమిషనరు విక్రమ సింహారెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని ఇందిరాగాంధీ కూడలి నుంచి వినాయక కూడలి మీదుగా రైల్వేస్టేషన్ దాకా రహదారిపై వ్యాపారాలు నిర్వహించే వారితో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్లను ఆక్రమించి ప్రజల రాకపోకలకు ఎట్టి పరిస్థితుల్లో ఆటంకాలు సృష్టించరాదని తెలిపారు.



వీధి వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై, పుర కమిషనరు

ఓటీపీ చెప్పొద్దు..

దోమ: ఆన్‌లైన్ మోసాల వలలో పడకుండా ఉండేందుకు అపరిచిత వ్యక్తులకు ఓటీపీ నంబరు చెప్పొద్దని ఏఎస్ఐ సూర్యానారాయణ చారి అన్నారు. మంగళవారం మండల కేంద్రం దోమలో కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆన్‌లైన్ మోసాలపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నొక్కిచెప్పారు.

ఆ భవనానికి 113 ఏళ్లు




తాండూరు: పట్టణంలో రోడ్లుభవనాల శాఖకు చెందిన భవనానికి వందేళ్లు నిండి పోయాయి. పదేళ్ల కిందటే శిథిల స్థితికి చేరింది. ప్రస్తుతం ఎపుడు కూలుతుందో తెలియని పరిస్థితి. 1911లో నిర్మాణమైన భవనం 2011 వరకు సేవలను అందించింది. తర్వాత క్రమేపీ శిథిల స్థితికి చేరింది. ప్రస్తుతం దీని వయసు 113 ఏళ్లు. ఈ శిథిల భవనానికి అతి సమీపంలో 40 ఏళ్ల కిందట నిర్మించిన భవనంలో రహదారులు, భవనాల శాఖ సిబ్బంది ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. దీని పక్కనే నివాస గృహాలు, నీటి పారుదల శాఖ కార్యాలయం ఉంది. అనుకోకుండా భవనం కూలితే ప్రమాదం పొంచి ఉంది.

బాబోయ్.. మురుగు



న్యూస్‌టుడే, పెద్దేముల్: జనగాంలో పాఠశాల విద్యార్థులు మురుగు నీటి సమస్యతో సతమతం అవుతున్నారు. వృథా నీరు, గృహాల్లో వినియోగిస్తున్న నీరు పాఠశాల ఆవరణలోకి వచ్చి చేరుతోంది. నీరు బయటికి వెళ్లేందుకు తీసిన గుంత నిండుకుపోయి నీటి నిల్వతో దుర్వాసన వెదజల్లుతోంది. మైదానం మొత్తం చిత్తడిగా మారి విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు సమస్యను తీర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.

మెట్లబావికేదీ మహర్దశ



కొడంగల్: అధికారులు ఏడాది క్రితం హడావిడిగా మున్సిపల్ పరిధిలోని గాడిబావి శివాలయం వద్ద ఉన్న మెట్లబావిని శుభ్రం చేశారు. ఈ బావికి చరిత్ర ఉందని కాపాడుకొందామని పురపాలక సిబ్బంది పొదలు, చెట్లు తొలగించారు. ఆ తరువాత బావి గురించి పూర్తిగా మరిచిపోయారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి పురాతన కట్టడాలను, మెట్ల బావులను కాపాడుకొందామని వాటికి పూర్వ వైభవం తీసుకొని వద్దామని హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో అన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలోని ఈబావిపై అధికారులు దృష్టి పెడితే బాగుటుందని ప్రజలు కోరుతున్నారు.

కట్టెలు తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

బషీరాబాద్, న్యూస్‌టుడే: అనుమతుల్లేకుండా కట్టెలు తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. బషీరాబాద్‌కు చెందిన వ్యక్తి మైల్వార్ ప్రాంతం నుంచి ట్రాక్టరులో కట్టెలు తరలిస్తుండగా.. రైల్వే గేటు సమీపంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకొని విచారించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి ట్రాక్టరును అప్పగించారు.

సైబర్ మోసగాళ్లతో అప్రమత్తత అవసరం

మోమిన్‌పేట, న్యూస్‌టుడే: సైబర్ మోసాలకు పాల్పడే వారితో అప్రమత్తంగా ఉండాలని ట్రస్టు మేనేజర్ హాలిగా దయానంద్ సూచించారు. మంగళవారం పీస్ ఫోరం ట్రస్టు హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో టెలికాం రేగ్యులేటరీ అథారిటీ వారు వినియోగదారులకు మోమిన్‌పేట ఠాణా పోలీసులతో కలిసి అవగాహన కార్యక్రమాన్ని మోమిన్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. చరవాణికి వచ్చే తెలియని కాల్స్, సందేశాలు లింకులను తెరిచే ప్రయత్నం చేస్తే ఖాతాల్లో ఉన్న డబ్బులు ఖాళీ అవుతున్న సంఘటనలు ఎన్నో జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పల్ బుచ్చిరెడ్డి, ఠాణా ఎస్సై పుండరీకం ట్రస్టు సీఈవో అశోక్‌వర్ధన్ పాల్గొన్నారు.

కేటీఆర్ కాన్వాయ్‌పై దాడి సరికాదు

వికారాబాద్‌టౌన్, న్యూస్‌టుడే: నగరంలో హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లు కూల్చడంతో మూసి నిర్వాసితులకు భరోసా ఇచ్చేందుకు వెళ్తున్న భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కారుపై కాంగ్రెస్ వాళ్లు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ మంగళవారం అన్నారు. కూల్చివేతల్లో సర్వం కోల్పోయిన బాధితులకు అప్పన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు.

పేదల మేలు కోసమే పథకాలు

కుల్కచర్ల: పేదల మేలుకోసమే ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని చౌడాపూర్ మండల తహసీల్దార్ ప్రభులు అన్నారు. మల్కాపూర్‌లో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు నాగరాజ్ యాదవ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్పటి అశోక్ తదితరులతో కలిసి ఆయన లబ్ధిదారులకు గ్యాస్ రాయితీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

తాండూరు టౌన్: పట్టణంలోని వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ సంతోష్ కుమార్ తెలిపారు. పట్టణంలోని మిఠాయి దుకాణాలు, హోటళ్లు, పెట్రోల్ బంకులు, కిరాణ, మొబైల్ దుకాణాలు, ఆస్పత్రుల వద్ద తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని మంగళవారం వ్యాపారులకు తాఖీదులు జారీ చేసినట్లు తెలిపారు.

శిక్షణతో పనితీరు మెరుగు: యాదయ్య

చేవెళ్ల: నైపుణ్య అభివృద్ధి శిక్షణతో సిబ్బంది పని తీరు మెరుగుపడుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శంకర్‌పల్లిలో మిషన్ భగీరథ గ్రామ మంచినీటి సరఫరా సిబ్బంది శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందికి ధ్రువపత్రాలు అందజేశారు.

విద్యాధికారులకు సత్కారం



పరిగి: ఇటీవల మండల విద్యాధికారులుగా నియమితులైన గోపాల్, హరిలాల్, వెంకట్‌లను మంగళవారం తాము నివాసం ఉంటున్న సిద్ధాంతి కాలనీ వాసులతో పాటు పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. విద్యాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఈసందర్భంగా వారిని కోరారు.

8,9 తేదీల్లో సీపీఎం మహాసభలు

బషీరాబాద్: సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సభల ఆహ్వాన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. తాండూరు పట్టణంలో ఈనెల 8, 9వ తేదీల్లో ర్యాలీ, ప్రతినిధులతో మహాసభ ఉంటుందని, ప్రజా సమస్యలు, ప్రభుత్వం ఇచ్చిన హామీలపై చర్చించి వాటి అమలు కోసం పోరాట ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సురేష్, వెంకటేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు కృష్ణ, చందు, శ్యాం పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

తాండూరు టౌన్: వెనక నుంచి వచ్చిన లారీ ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. తాండూరు పట్టణ సీఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు.. సంగారెడ్డి నుంచి తాండూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సును మంగళవారం వెనక నుంచి వచ్చిన లారీ పట్టణ శివారులోని అంతారం దగ్గర ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సు ముందు భాగం ఒక వైపు దెబ్బతిన్నది. ప్రయాణికులెవరూ గాయపడలేదు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.





తుప్పు పట్టినా పట్టించుకోరే!

న్యూస్‌టుడే, తాండూరు: జిల్లాలోని వివిధ శాఖల్లో వినియోగంలో లేని వాహనాలు, యంత్ర పరికరాలు, నియంత్రికలు ఏళ్ల తరబడి వృథాగా ఉన్నాయి. అక్కడే తుప్పు పట్టిపోయాయి. నీటి పారుదల, అగ్ని మాపక, మున్సిపాలిటీ, విద్యుత్తు, రహదారులు, భవనాలు, పంచాయతీ రాజ్, వ్యవసాయ వంటి తదితర శాఖల్లో వినియోగంలోని పరికరాలు, వాహనాలు ఏళ్ల కిందటే తుక్కుగా మారాయి. ప్రభుత్వం వీటిని తుక్కు కింద వేలం వేసి విక్రయిస్తే రూ.కోట్లల్లో సమకూరుతుంది. ఉన్నతాధికారులు ఆదిశగా చర్యలు చేపట్టాలి.

ఆడి, పాడిన విద్యార్థులు

న్యూస్‌టుడే, తాండూరు: పీపుల్స్ డిగ్రీకళాశాలలో మంగళవారం స్వాగతోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల కార్యదర్శి పి.ఉత్తమ్‌చంద్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చంద్రకళ, అకడమిక్ డైరెక్టర్ సత్యానంద్ పాల్గొన్నారు.

‘దసరాకు నెల జీతం బోనస్‌గా ఇవ్వండి’

పరిగి, న్యూస్‌టుడే: ఆర్టీసీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక నెల వేతనాన్ని బోనస్‌గా ప్రకటించాలని టీజేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.హనుమంతు ఒక ప్రకటనలో కోరారు. గతంలో ఓసారి బోనస్‌గా ఇచ్చారని ఇప్పుడు కూడా అమలు చేయాలని అన్నారు. సింగరేణి కార్మికుల మాదిరిగానే ఆర్టీసీ వారు కూడా కష్టపడి పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

లబ్ధిదారులకు పత్రాల పంపిణీ

పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: రూప్‌సింగ్‌తండా, ఇబ్రహీంపూర్, మల్కయపేట్‌తండా, హీర్యానాయక్ తండా, గడిసింగాపూర్ తదితర గ్రామాల్లో ఎంపికైన గృహలక్ష్మి ఎల్పీజీ లబ్ధిదారులకు మంగళవారం సంబంధిత అధికారులు పత్రాలను పంపిణీచేశారు.

నేడు ఉపాధి హామీ గ్రామసభ

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: ముజాహిద్‌పూర్ పంచాయతీ ఆవరణలో గాంధీ జయంతిని పురస్కరించుకుని నేడు గ్రామ సభను నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్ తెలిపారు. గ్రామ ప్రత్యేక అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

వికారాబాద్ గ్రామీణ: మండల పరిధిలోని 21 గ్రామ పంచాయతీల్లో గాంధీ జయంతి సందర్భంగా గ్రామ సభలు ఏర్పాటు చేయాలని వికారాబాద్ మండల అభివృద్ధి అధికారి వినయ్‌కుమార్ తెలిపారు.

తపస్ అధ్యక్షుడి ఏకగ్రీవ ఎన్నిక

కొడంగల్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) అధ్యక్షుడిగా ముద్దాయిపేట వెంకటేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. మంగళవారం కొడంగల్ మండల కేంద్రంలో నిర్వహించిన కమిటీలో గౌరవ అధ్యక్షురాలిగా శ్రీప్రియను, మండల ప్రధాన కార్యదర్శిగా బాకారం చంద్రశేఖర్, కార్యదర్శిగా సేవ్యానాయక్, కోషాధికారిగా ఈశ్వరయ్యను ఎన్నుకొన్నులు వివరించారు.

3నుంచి పద్మనాభుడి దసరా ఉత్సవాలు

వికారాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆలంపల్లి అనంతపద్మనాభ స్వామి ఆలయంలో 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. 3వ తేదీన ధ్వజారోహణ కార్యక్రమాలతో ఉత్సవాలు మొదలవుతాయి. 12వ తేదీన అశ్వవాహన సేవ అనంతరం ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈవో నరేందర్ తెలిపారు.

చేయిచేయి కలిపి.. సేవచేయ కదిలి

పరిగి, న్యూస్‌టుడే: స్వచ్ఛభారత్‌లో భాగంగా మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది శ్రమదానం నిర్వహించారు. కోర్టు ఆవరణలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించడంతో ప్రాంతం సుందరంగా మారింది. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్‌యాదవ్, భక్తకుమార్ ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

బరిలో దిగితే.. బంగారు పతకమే

గిరిజన గురుకుల విద్యార్థుల ప్రతిభ

న్యూస్‌టుడే, కొడంగల్, పరిగి:



విజేతలైన ముగ్గురు విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యతో పాటు క్రీడల్లో సైతం చక్కటి ప్రతిభ కనబరుస్తున్నారు ఆ విద్యార్థులు. పాతకొడంగల్ గ్రామంలోని గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన పలువురు బాలురు వివిధ రకాల పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధిస్తున్నారు. తాజాగా సరూర్‌నగర్ స్టేడియంలో రంగారెడ్డి జిల్లా స్థాయి (అథ్లెటిక్స్-2024) పోటీలు జరిగాయి. పలు పోటీల్లో పాల్గొనడమేకాకుండా బంగారు పథకం సాధించారు.

రాష్ట్ర స్థాయికి ఎన్నిక..

- ఈ గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుకొంటున్న అంగోత్ ప్రవీన్‌కుమార్ షాట్‌పుట్ విభాగంలో 10.98 మీటర్లు లక్ష్యం సాధించి జిల్లాలో తొలి స్థానం సంపాదించారు. డిస్కస్‌త్రోనూ 16.60 మీటర్లు లక్ష్యం చేరుకుని రెండో స్థానంలో నిలిచాడు.
- 9వ తరగతి విద్యార్థి వికాస్ లాంగ్‌జంప్‌లో 4.4మీటర్లు, బ్యాక్ త్రోలో 13 మీటర్లు, 60మీటర్లు రన్నింగ్ 8.07సెకండ్లలో చేరుకొన్నాడు. ఇలా అన్ని విభాగాల్లో జిల్లా మొదటి స్థానంలో నిలిచాడు.
- సేనావత్ రమేష్ (7వ తరగతి) ఖోఖో విభాగంలో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచాడు. ఈ విధంగా ముగ్గురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు.

క్రీడలకు ప్రత్యేక సమయం

- గోపాల్, వెంకటేష్, పాఠశాల క్రీడా ఉపాధ్యాయులు

విద్యార్థులు శారీరకంగా, మానసింగా ఉత్సాహంగా ఉండాలని బడిలో క్రీడలకు ప్రత్యేక సమయం కేటాయిస్తున్నాం. ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు, సాయంత్రం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు క్రీడల్లో విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు అందిస్తున్నాం. ఒకే గురుకుల పాఠశాల నుంచి ముగ్గురు బంగారు పతకాలు సాధించడం చాలా సంతోషంగా ఉంది. మరింత మంది విద్యార్థులను క్రీడల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిపేందుకు కృషి చేస్తాం.

ఉరేసుకొని కార్మికుడి బలవన్మరణం

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: పరిశ్రమలో కూలి పనిచేసుకునే కార్మికుడు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పటాన్‌చెరు ఎస్సై అభిమాన్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్‌కు చెందిన మానయ్య, అతని కుమారుడు ప్రకాష్(25), కోడలితో కలిసి ఇస్నాపూర్‌లో ఉంటూ పరిశ్రమల్లో కూలీ పని చేసుకుంటున్నారు. మానయ్య మంగళవారం ఉదయం పని వెళ్లగా.. ప్రకాష్ ఉదయం తానుంటున్న ఇంట్లో పడక గది గొళ్లెం పెట్టుకుని ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ప్రకాశ్ భార్య చూసేసరికి వేలాడుతూ కన్పించడంతో పక్కవాళ్ల సహాయంతో తలుపు పగులగొట్టి అతని మృతదేహాన్ని కిందకు దింపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తండ్రి మానయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.